

# చేతికి రాని కొడుకు

హెచ్చార్కె

మద్దిలేటి వాగు దాటినాక టాక్సీ ఆగింది. డ్రైవరు పక్కన కూర్చున్న నన్ను దిగమన్నారెవరో. వెనుక సీట్లోంచి తమ్ముడు, అమ్మ కూడా దిగారు. అప్పటికే మా ఎద్దుల బండి వచ్చి వుంది. చాలా ఇష్టపడి కొనుక్కున్న ఒంగోలు గిత్తలు.

తాము అక్కడికి వచ్చింది ఎందుకో తెలియని మూగజీవాలు. ఆ చల్లని పొద్దుటి గాలికి ఇష్టంగా నిలబడి వున్నాయి. కాస్త పసుపు కలిసిన మీగడ రంగులో ఎండలో చిత్రంగా మెరుస్తున్నాయి.

టాక్సీ డిక్కీలో ముడుచుకుని పడుకున్న నాన్నను జాగర్తగా తీసి, ఎద్దుల బండి మీద పడుకోబెట్టారు. అమ్మను బండి మీద నాన్న కాళ్ల దగ్గర కూర్చోమన్నారు.

నేను, తమ్ముడు ఇంటినుంచి వచ్చిన మరో ఇద్దరు తమ్ముళ్లు, చిన్నాన్నలు, మామలు బండి వెంట నడిచాం.

తొలకరి వాన కాలం. పెద్దబజారులో రాత్రి కురిసిన వాన, బురద. చిన్న చిన్న కాల్వలుగా పారుతున్న వాన నీళ్లు. అప్పుడప్పుడే వూరిని కావిలించుకుంటున్న చల్లని ఎండ.

బండి మీద నాన్న కాళ్ల దగ్గర, తల మీద కొంగు కప్పుకుని బాగా మాసిపోయి పగుళ్లు వారిన పెళ్లి కూతురు బొమ్మలా అమ్మ.

ఊరిని సగం అటు సగం ఇటు విడదీస్తూ అంత పొడవైన బజారు బహుశా ఇంకే వూరికీ వుండదు. మసీదు, వీరభద్రుని దేవాలయం, గ్రామ కచేరి, ముఖ్యమైన అంగళ్లు, బందెల దొడ్డి, పీర్ల చావిడి, జెండా మాను, రాత్రులు ఊరి యువకులు భజనకు చేరే రాముల్దేవళం, హరికథలూ, బుర్రకథలూ చెప్పే మఠం అరుగులు, పంచాయితీలకు పెద్దమనుషులు కూర్చునే రచ్చబండ... అన్నీ ఆ బజారులోనే వుంటాయి. వాగు ఒడ్డున చెలిమల దగ్గర కడవలు పెట్టుకుని తమవంతు మంచినీళ్ల కోసం కూర్చున్నవాళ్లు మావైపు సానుభూతిగా చూశారు.

బజారుకు ఈ చివర వాగు ఒడ్డయితే ఆ చివర మా నెరవాటి రెడ్ల ఇండ్లు.

బండి బయల్దేరింది. బురదలో మెత్తగా దొర్లుతున్న బండిగాన్ల చప్పుడు. అప్పుడప్పుడు ఎద్దుల మెడ గంటల చప్పుడు. అంతే. బజారు పొడవునా బరువైన మౌనం ఎవరూ మాట్లాడలేదు. మాట్లాడినా నాకు వినిపించలేదు.

బండి మీద పడుకున్న నాన్నను, నాన్న కాళ్లదగ్గర తలొంచుకుని కూర్చున్న అమ్మను చూస్తూ ఏం జరుగుతున్నదో అర్థం చేసుకోడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ నడిచాను.

ఇప్పుడు ఇన్నేళ్ల తరువాత సరే. అప్పుడు ఆ ఉదయం నా మనస్సులో ఏదీ అందని అగాధం. అంతా అస్పష్టం. అర్థరహితం.

బండి ఇల్లు చేరింది. నాన్నను బండి మీంచి దించి ఇంటి ముంగిట వారపాకు కింద పడుకోబెట్టారు. తలాపున దీపం పెట్టారు. ఎందుకు దీపం, తెల్లగా తెల్లారాక ఇంకా ఎందుకు దీపం అనిపించిందొక్క క్షణం. పుట్టిన వెంటనే చనిపోయిన ప్రశ్న.

కాసేపటికి వారపాకు బయట బజారుకు దగ్గరగా నులక మంచం వేశారు. నాన్నను తెచ్చి మంచం మీద కూర్చోబెట్టారు. ధోవతి అలాగే వుంచి, అంగీ తీసేశారు. ఒళ్లు రుద్దుతూ నీళ్లు పోశారు.

ఎక్కడా కొవ్వు కనిపించని బక్క పల్చని శరీరం. ఎముకల మీద చర్మమేగాని కండలు లేవనిపించేంత

పల్చని చెంపల కోల ముఖం. మా నాన్న అని కాదుగాని, అంత చక్కని ముక్కుని నేను మరెవరి ముఖంలో చూళ్లేదు. రోజూ పొద్దున్నే గడానికి బయల్దేరుతూ పగ్గాలతో గుంటకకు కాడిమాను కట్టి దానికి మేడితోక బిగించి కోటేరు వేస్తున్నప్పుడు ఆయన చూపించే శ్రద్ధ నన్ను ఆశ్చర్యపరిచేది. అదిగో ఆ కోటేరు లాగే చక్కగా వుంటుంది ఆయన ముక్కు. పెన్సిల్‌తో గీసినట్టున్న కనుబొమల కింద పెద్ద కళ్లు. ఎడం వైపు పాపిట తీసే అలవాటు వల్ల కొద్దిగా కుడి కంటి మీదికి పడుతున్న ముంగురులు. అప్పటికి ఆయనకు యాభై ఏండ్లు వుండీ లేక. నుదిటి మీద కొన్ని గీతలు తప్ప శరీరంలో ఎక్కడా ముడుతలు లేవు.

నాన్న ముఖంలో అంత ప్రశాంతతని నేనెప్పుడూ చూళ్లేదు. కళ్లు మూసి వున్నాయిగాని, ఆయన కళ్లలో ఎప్పుడూ కనిపించే ఎర్రజీర అప్పుడు వుండి వుండదు.

ఆయనకు బక్క సంజీవరెడ్డి అనేదొక పేరు. లిగాడి సంజీవరెడ్డి అని మరొక పేరు. మనిషి ఏ మాత్రం యుక్తిపరుడు కాదు. ఆయనకు చాలా తొందరగా కోపం వచ్చేది.

నిజానికి ఆయన ముఖం ఎప్పుడూ కోపంగానో విచారంగానో వుండేది. తన మాట కాదంటే అప్పటికి వూరుకుందామనుకునేవాడు కాదు. కేకలేసేవాడు. బూతు మాటలు అవలీలగా దొర్లేవి. సంతోష సమయాల్లోనయితే మరీను. లిగాడి అంటేనే పేచీ. అన్ని పేచీలు అయిపోయి సమస్త జనులతో శాశ్వత సంధి చేసుకున్నట్లుంది ఇప్పుడాయన ముఖం.

నాన్నకు బాగోలేదని ఆసుపత్రిలో చేర్చారని, హైదరాబాదులో పార్టీ ఆఫీసులో పనిచేస్తున్న నాకు రెండు రోజుల క్రితమే కబురొచ్చింది. సహచరులయితే వెంటనే బయల్దేరమన్నారు. నేను ఎడిట్ చేస్తున్న పార్టీ పత్రిక పని చివర్లో వుంది. ఆ పని పూర్తి చేసి మరునాడు బయల్దేరాం నేనూ మా ఆవిడ.

అప్పటికి నాలుగేళ్లుగా నేనూ మా ఆవిడా పార్టీలో పూర్తికాలం కార్యకర్తలుగా పని చేస్తున్నాం. ఆ నాలుగేళ్లలో నేను మా వూరికి ఎప్పుడయినా వెళ్లానా? గుర్తు లేదు. ఇంటికి వెళ్లి నేను చూసుకోవాల్సిన పనులేవో వున్నట్లు నాకు ఎప్పుడూ అనిపించేది కాదు.

మా బస్సు కర్నూలులో ఆగేసరికి చీకటిపడింది. మా ఆవిడ వెళ్లి వేరే ఊళ్లో అమ్మమ్మ దగ్గర వుంటున్న మా పాపను తీసుకొస్తానంది. తనను మరో బస్సు ఎక్కించి, నేను పెద్దాసుపత్రికి చేరేసరికి నాన్న దగ్గర అమ్మ ఒక్కతే వుంది. తమ్ముడు పడుకోడానికి కర్నూల్లోనే వున్న మామ వాళ్లింటికి వెళ్లాడు. నాన్నకు నిద్ర మందేదో ఇచ్చినట్లున్నారు. కళ్లు మూసుకుని పడుకున్నాడు. ఆయన జబ్బు గురించి డాక్టర్లు ఏం చెప్పారో అమ్మను అడిగి తెలుసుకుంటూ తింటానికి ఆమె ఏదో పెడితే తిని మంచం పక్కన పడుకున్నాను.

రాత్రి ఏవో మాటలు వినిపిస్తే మెలకువ వచ్చి అమ్మ వైపు చూశాను. 'పిల్లోన్ని కింద పండబెట్నావు' అని నాన్న కోప్పడ్డాడట. 'పిల్లోడం'టే ఎవరో కాదు. నేనే. ఆ స్థితిలో తన పెద్ద కొడుకు... ఎన్నెన్నో ఆశలు పెట్టి అన్ని ఆశలూ ముంచేసి 'పార్టీలో కలిసిపోయిన' పెద్ద కొడుకు... మంచం మీద పడుకున్నాడో నేల మీద పడుకున్నాడో గమనించి అమ్మను కోప్పడిన బక్క సంజీవ రెడ్డిని ఏమనాలో నాకు తోచలేదు.

వెళ్లి మంచం మీద తన పక్కన కూర్చున్నాను. ఆయన కాసేపు కళ్లు తెరిచి చూశాడు. తన చేతిని ముట్టుకోవాలనిపించింది నాకు. కాని ముట్టుకోలేదు. ఆయన కూడా అలాంటి ప్రయత్నం చేయలేదు. తన కళ్లలో కోపమో, నిష్ఠూరమో, సంతోషమో, దుఃఖమో తెలియని ఒక నిస్సహాయమైన నిర్లిప్తత.

'నువ్వంటే నాకు ప్రాణం. కాని నేను నిన్ను అందుకోలేను. నువ్వు నన్ను అందుకోలేవు,' అని ఆయన ఒక మౌనభాషలో చెబుతున్నట్టు అనిపించింది.

ఎందుకంత దూరం మా ఇద్దరి మధ్య? ఎలా తయారయ్యాయి మా ఇద్దరి మధ్య కనపడని కటకటాలు? మా ఇద్దర్లో కటకటాల్లోపల వున్నదెవరు?

బాగా చిన్నప్పుడు చిట్టి పొట్టి తప్పులకు నాన్న చేతిలో విరిగిన ములుగర్రలు, తెగిన చర్నాకోలలు తప్ప మా ఇద్దరి మధ్య మరే సంఘటనలూ గుర్తులేవు.

పెద్దవాడినయ్యాక నేనేమనుకుంటున్నానో ఆయనకు తెలియదు. ఆయన ఏమనుకుంటున్నాడో నాకు తెలియదు. ప్రేమ లేదని కాదు. భూగర్భంలో ప్రవహించే సరస్వతి నది వంటి ప్రేమ ఉంది. దోసిలెత్తి తాగడానికి సరే, కంటికి కూడా కనిపించని ప్రేమ. భౌతిక అనుబంధంగా మాటల్లో వ్యక్తం కాని ప్రేమ.

కాసేపలా కూర్చుని వెళ్లి మళ్లీ పడుకున్నాను. నాన్నకుకాస్త నెమ్మదించగానే, నేనే చొరవ తీసుకుని ఆయనతో మాట్లాడాలనుకున్నాను. ఏమేం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో ఆలోచించుకుంటూ నిద్రపోయాను.

అర్ధరాత్రి తరువాత ఎప్పుడో నాన్న చనిపోయాడు. తెల్లవారురఝామున అమ్మకు అనుమానం వచ్చి నర్సును పిలిచింది.

కర్నూలులో వుండే మామయ్య సాయంతో టాక్సీ మాట్లాడుకుని మా వూరికి బయల్దేరాం అమ్మ, నేను, తమ్ముడు, నాన్న.

నులక మంచం మీద కూర్చోబెట్టి నాన్నకు నీళ్లు పోస్తున్నప్పుడు నేను కొంచెం ఎడంగా కాళ్ల కట్ట వైపు నిలబడి నాన్న ముఖంలోకి చూశాను. ఎవరో వచ్చి ఆకువక్క మడిచి ఆయన నోట్లో పెట్టారు. అప్పుడా యన నావైపు చూసి తల వూపినట్లయి ఉలిక్కిపడ్డాను. ఆయన నాతో ఏదో చెప్పాలనుకుంటున్నాడు. చెప్ప బోయి ఆగిపోతున్నాడు.

''ఏంటి?'' అని అడుగుతూ ఒక అడుగు ముందుకు వేశాను. నేను అడిగింది నాన్నను అని అక్కడ ఎవరికీ తోచలేదు. "ఏం లేదులే," అంటూ తమ పనులు కానిచ్చారు.

నాన్న నాతో మాట్లాడాలనుకుంటున్నాడు. మాట్లాడలేకపోతున్నాడు.

ఇక అక్కడ ఉండాలనిపించలేదు.

క్రతువులు కర్మల మీద నాకు సదభిప్రాయం లేదని, 'కమ్మినిస్టోడిన'ని అక్కడ అందరికీ తెలుసు. చదువుకున్నవాడిననే భయగౌరవాల వల్ల నన్నేమీ అనరంతే. అక్కడ ఉండి నేను చేయాల్సిన పనులేమీ లేవు కాబట్టి ఎవరూ నన్ను పట్టించుకోలేదు. అక్కడ నేనొక మరో ప్రపంచం మనిషిని. వాళ్ల ప్రపంచం మనిషిని కాదు.

నేను నెమ్మదిగా ఇంట్లోకి నడిచాను.

మాది పూర్తిగా మూడంకణాల ఇల్లు. ఇంటి ముందు పైకప్పు మీంచి దించిన వారపాకు. వార పాకులో గూళ్లు కట్టుకున్న పిట్టలు మనుషుల అలికిడికి కావచ్చు చప్పుడు చేయడం లేదు. ఒకడుగులోనికి నడిస్తే ఎడమవైపు సామానులు దాచుకునే కొట్టిడిల్లు. అమ్మ దాచిపెడితే నేను దొంగిలించి నాన్నతో దెబ్బలు తిన్న బెల్లంకుండ అందులోనే వుంటుంది. కొట్టిడింటికి కుడివైపు పెద్ద అరుగు. రెండింటి మధ్య, ద్వారబంధానికి పూసిన ఎర్రమన్ను పట్టెలతో పెద్ద తలవాకిలి. తలవాకిలి దాటితే గాడిపాడు. నడిచే దారికి అటు ఇటు రెండు పొడుగాటి గాళ్లు. ఒక్కో గాడికి అటు ఇటు కట్టేసిన ఎద్దులు, బర్రెలు గాళ్లలో మేత అయిపోయి పడుకుని నెమరేస్తున్నాయి. ఇంకా లోపలికి పోతే కాస్త ప్రైవేటుగా మాట్లాడుకోడానికి కూర్చునే రెండు పెద్ద అరుగులున్న పడ్సాల. పడ్సాల కూడా దాటి రెండు మెట్లెక్కితే వంటిల్లు.

నేను వెళ్లేసరికి లోపల ఎవరూ లేరు. గవాసి నుంచి పడ్సాలలో కొద్దిగా ఎండ పడుతోంది. చల్లని మసక చీకటిలో వంటింటికి ముందు పెద్దరుగుల మధ్య నిలబడ్డాను. అక్కడ ప్రతి స్తంభం, ప్రతి దూలం, ప్రతి దెంతె ఒళ్లంతా కళ్లు చేసుకుని నన్నే చూస్తున్నట్లని పించింది. నన్ను ప్రశ్నిస్తున్నట్లనిపించింది.

'నువ్వు. నువ్వు. నిన్ను నమ్ముకున్నాం మేము. నిన్ను నమ్ముకున్నాడా మానవుడు. ఏం చేశావు నువ్వు' అని అడుగుతున్నట్లనిపించింది.

కుడివైపు అరుగు మీద కూర్చున్నాను. ఆ అరుగు మీదే చలికాలం అందరం మంచాలేసుకుని పడుకునే వాళ్లం.

ఒక చలికాలం అర్ధరాత్రి. అప్పుడు నాకు పద్నా లుగు పదిహేనేళ్లుంటాయి. శరీరంలో యవ్వనం చిగురే స్తోంది. పక్కమంచాల మీంచి గుసగుసలు వినిపిం చాయి.

అమ్మ నాన్న గుసగుసలాడుకుంటున్నారు. కుతూహలంతో చెవులు రిక్కించి విన్నాను.

అవి సెక్స్ కబుర్లు కావు. బతుకు భయం కబుర్లు.

"దేశం నాగిరెడ్డి పిలిపిచ్చినాడంట గదా?"

"అవ్, పైటాలప్పుడు రమ్మంటె పొయ్యొస్తి"

"... ... ..."

"ఇంగేంది. బాకీ సంగతే"

"ఇయ్యేడు వడ్డీలన్న గట్టకపోతిమి. ఎన్నాల్లుం టారు వాళ్లు గుడ్క."

"ఉండకపోతే ఉరిబెట్టుకోమను. ఎల్లినప్పుడు గడ్డం. ఊరిడ్చిపోతామా. నిరుడు గింజ సేతికి రాక పాయ. యాన్నించి గట్టాల. పెండ్లాం పిల్లల్ని అమ్మి కట్టాల్నా... ఇయ్యేడు బుడ్డలు పొసినాక బాకి గడ్తానని సెప్పొచ్చినాను. ఎంత ఈనంగ పండినా వడ్డన్నా గట్టక పోతామా?"

"వచ్చే యాడాది పెద్దోనికి తలముడిపి బల్లో సదువయిపోతాది. కాలేజికో యాడికో పంపిచ్చా నంటొండావు. బుడ్డల లెక్క వాని కర్సులకే సాల్తదో సాలదో. బాకీలు గడ్తానంటొండావు"

"అవ్, దానమ్మ. యాడికోసాటికి అయితాదిలే. దేవుడుండాడు."

"ఏం దేవుడో ఏం మంటిగడ్డలో. ఒగ వాన తక్కు వైతే బొంద వొయ్యొ సేద్దెం. ఒగవాన ఎక్కువైతే మురిగి పొయ్యొ సేద్దెం. మనకు యాడయితాది. కాలేజీలు గీలేజీలు మన లెక్కటోల్లకు గాదు. ఇంగనన్న బడి సాలి పిచ్చి వాన్ని గడానికి పంపిచ్చె పాయ. ఇంగొగ ఐదెక రాలు గుత్తక తీస్కోని సేసుకుంటే సిన్నోల్లనన్న సదివిచ్చు కోవచ్చు."

"నువ్వు నోర్మూసుకోని పడుండు. ఆడదాని మాటింటే వణుకుల గడ్డకే. బడిలో అన్నిట్లో వాడే పస్టు మార్కులంట. మొన్న గడాముల బస్టాండులో వాల్ల సారు కనబడి సెప్తాంటే నాకే ఎట్టెట్టనో అయింది. వానికి గడెం గిడెం శాతగాదు. కాపోల్ల ఇండ్లల్లో తప్పుపుట్టిన్నా కొడుకు."

''... ... ...''

''సూస్కుంద. ఎట్టయితె అట్టయితాది. ఇట్టనె ఇగ్గుత. పిల్లోని సదువుకని అడ్గుతె బుడ్డ అనిమిరెడ్డి, నల్లల రంగారెడ్డి లెక్క పెద్దోల్లు సద్దువాటు సెయ్యం పొమ్మంటారా?! వాని సదువు మింద పెట్టిన దుడ్లు యాడికి వోతాయి. బ్యాంకులో వెట్టుకున్నెట్టే వాల్ల గ్గుడ్క.''

''అవులే. పిల్లోడు మంచోడు, తెలివైనోడని అంద రనుకుంటారు. వాడు బయటరుగు మింద కూకోని మాట్టాడుతుంటె పెద్దోల్లు గుడ్క నోరెల్లవెట్టి సూస్తాం టారు''

''నియ్యక్క. వాడు సదుకోని ఉద్యోగంలో సేరాలగాని పిల్లనిచ్చెటోల్లు కార్లేస్కోని రాకపోతారా నువ్వు నేను సూడకపోతామా! వాడు పైకి పోతే తమ్ము ల్లను వాడే ఇగ్గుకుంటాడు.''

''వాయమ్మ. నీ తలకాయలో ఇన్ని ఆలోశన్లుం డాయా? ఇంగ నా మాటల్యాడ ఇంటావులె.''

నేను అరుగు మీద కూర్చుని మోకాళ్ల మధ్య తల దాచుకున్నాను. లోపల పొంగే సముద్రాల్ని అణచి పెట్టడం నావల్ల కాలేదు. బయటవాళ్లకు వినిపించ కుండా ఏడ్చాను.

నేను తప్పు చేశానా?

చదువయిపోయి ఏదో ఉద్యోగం చూసుకుని నాన్నకు ఆసరా కావలసిన సమయంలో యూని వర్సిటీలో పరిచయమైన జెండాల వల్ల పక్కదారి పట్టానా? బతుకులో వున్న పోరాటాన్ని ఒదిలేసి, పుస్తకా ల్లోని పోరాటాల చిరునామా వెదుక్కుంటూ చాలా దూరం వెళ్లిపోయానా? బతుకులో వున్న పోరాటమే అయితే అందులో నాన్న, అమ్మ కూడా భాగస్తులయ్యే వారా?

నాన్నకు అప్పులున్నాయని తెలుసు. అయితే రైతు బయట పడలేనంత అప్పులని తెలియదు. పిల్ల నిస్తామని కార్లల్లో మనుషులు రావాలనే నాన్న కలను నేను సీరియస్‌గా తీసుకోలేదు. పరిస్థితి అంతకన్నా తీవ్ర మైందని ఆయన చనిపోయింతర్వాతగాని తెలియ లేదు. నాన్న ఎప్పుడూ చెప్పలేదు. మేము ఎప్పుడూ మనసులు విప్పి మాట్లాడుకోలేదు.

ఇంతలో నాకు మా ఆవిడ గుర్తొచ్చింది. నా దుఃఖం తనకు చెప్పుకోవాలనిపించింది. ఇంకా రాలేదు. బస్సు లేటయ్యుంటుంది. తనతోపాటు మా చిట్టితల్లి వస్తుంది.

పాప దోగాడే వయసులో మూన్నెళ్లపాటు మేము ఈ ఇంట్లోనే ఉన్నాం. నేను పాపను ఎత్తుకుని తిరిగే వాడిని. వంటింట్లో అమ్మతో, మా ఆవిడతో కబుర్లు చెప్పేవాడిని.

''మగపిల్లోనివి. నువ్విట్టా వంటింట్లో ఆడోల్లతో మాట్లాడుకుంట ఉండడం, పిల్లను ఎత్తుకోని తిరగడం మీ నాయ్నకు ఇష్టముండదురా,'' అని అమ్మ చెప్పేది.

అమ్మ మాటలు గుర్తుకొచ్చాక నాన్నకు నాకు మధ్య కనపడని కటకటాలు ఏమిటో కొంచెం అర్థ మయినట్లయ్యింది.

ఎవరో వస్తున్న అలికిడి. కర్చీఫ్ తీసి కళ్లు తుడుచు కున్నాను. ఏడుస్తూ ఇతర్లకు కనిపించడం ఇష్టం లేక. ఇంతా చేసి నాన్న చాలు కొడుకునే.

చిన్నాన్న లోపలికి వచ్చాడు. అరుగు మీద నా పక్కన ఒక్క క్షణం కూర్చుని, ''జయమ్మోల్లు గూడా వచ్చినారు. పొద్దువోతది. ఇంక పోదాం పద,'' అన్నాడు. జయమ్మ అంటే మా ఆవిడ.

బయటికి వెళ్లి చూస్తే మా అమ్మ పుట్టింటి నుంచి వచ్చిన మా మేనమామ, ఆయన కొడుకులు, మా ఊళ్లో నాన్న స్నేహితులు, దాయాదులు అందరూ వచ్చి నిలబడి వున్నారు.

పాడె బయల్దేరింది.

పొద్దున టాక్సీ ఆగిన చోటికి కాస్త కుడివైపున చెట్లతో నిండిన వాగు ఒడ్డున తవ్విన గుంతలో నాన్నను దించారు.

మొదటి పిడికిలి మట్టిని నేనే వేయాలట.

దాన్ని హక్కు అనుకోవాలా? శిక్ష అనుకోవాలా?

పిడికిలి విప్పబోతూ నాన్న మొఖంలోకి చివరిసారి ఆశగా చూశాను.

నాన్న కొద్ది కొద్దిగా మట్టిలో కలిసిపోయాడు. రైతు పోరాటాలంటూ ఏవేవో మాట్లాడుతుంటాను. కాని మట్టితో మాట్లాడ్డానికి నా దగ్గర భాష లేదు. చదువుకున్న కొడుకుతో మాట్లాడ్డానికి మా నాన్న దగ్గర భాష లేనట్లే.

ఇంటికి వచ్చి స్నానాలూ అవీ అయ్యాక ఒక్కడినే మంచం మీద కూర్చున్న నా దగ్గరికి వచ్చి నిశ్శబ్దంగా నిలబడింది మా పాప. ఇతర్లు చూస్తున్నారని సందే హించకుండా తనను ఎత్తి ఒళ్లో కూర్చోబెట్టుకుని గుండెలకు హత్తుకున్నాను.

''పాపను మనతోపాటు హైద్రాబాదు తీసుకు పోదాం. మన దగ్గరే వుంచుకుందాం. దూరంగా వద్దు,'' అన్నాను మా ఆవిడతో. ఆమె మౌనంగా తలూపింది కళ్లల్లో చెమ్మ ఒత్తుకుంటూ.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 1 ఏప్రిల్ 2007*